క్లుప్తంగా

అమ్మవారి ఆలయాల్లో విశేష పూజలు


ప్రత్యేక అలంకరణలో తిరుపతి గంగమ్మ

భాకరాపేట: శ్రావణ మాసం మంగళవారాన్ని పురస్కరించుకుని చిన్నగొట్టిగల్లు మండలంలోని అమ్మవారి ఆలయాల్లో విశేష పూజలు నిర్వహించారు. వేకువ జాము నుంచే అమ్మవారికి అభిషేకాలు, అలంకరణ, అర్చనలు పూజాది కార్యక్రమాలు చేశారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

దామోదరన్‌కు డాక్టరేట్



తిరుపతి సిటీ: ఎస్వీ యూనివర్సిటీ స్టాటిస్టిక్స్ విభాగపు పరిశోధక విద్యార్థి ఎస్.దామోదరన్ డాక్టరేట్ డిగ్రీ పట్టా అందుకున్నారు. ప్రొఫెసర్ బి. సరోజమ్మ పర్యవేక్షణలో సమ్ కాంట్రిబ్యూషన్ టు రిగ్రెషన్ మోడల్స్ అనే అంశంపై పరిశోధన చేశారు.

కందులవారిపల్లెలో రూ.18.5 లక్షలతో సీసీ రోడ్లు


పనులను పర్యవేక్షిస్తున్న ఎంపీటీసీ సభ్యుడు రాజయ్య

చంద్రగిరి(తిరుపతి రూరల్): చంద్రగిరి మండలం నారావారిపల్లికి కూత వేటు దూరంలో ఉన్న కందులవారిపల్లె అరుంధతి వాడలో మట్టి రోడ్లతో అవస్థలు పడుతున్న దళితులకు రోడ్డు కష్టాలు తీరనున్నాయి. చంద్రగిరి ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి సహకారంతో వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి చొరవతో రూ.18.5 లక్షలు మంజూరయ్యాయి. ఆ నిధులతో అరుంధతివాడలో సీసీ రోడ్లు వేస్తున్నారు. మంగళవారం నారావారిపల్లి ఎంపీటీసీ సభ్యుడు రాజయ్య రోడ్డు నిర్మాణ పనులను పర్యవేక్షించారు. చెవిరెడ్డికి రుణపడి ఉంటామని గ్రామస్తులు తెలిపారు.

మహాసభను విజయవంతం చేద్దాం


మాట్లాడుతున్న ఎమ్మార్పీఎస్ నేత నాగరాజు

రామచంద్రాపురం: ఆగస్టు రెండో వారంలో చేపట్టనున్న మాదిగల విశ్వరూప మహాసభను విజయవంతం చేద్దామని ఎమ్మార్పీఎస్ జాతీయ అధ్యక్షుడు నాగరాజు అన్నారు. మంగళవారం మండలంలోని నెత్తకుప్పంలో సమావేశం నిర్వహించారు. ఎస్సీ వర్గీకరణ న్యాయమైన అంశమన్నారు. దీనికి అన్ని పార్టీలు ఆమోదించాలని కోరారు. పెంచలయ్య, రాధాకృష్ణ, గోపి, రామకృష్ణ, నవీన్, రవి, అశోక్, నరేష్, చిన్నయ్య తదితరులు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన అవసరం


మాట్లాడుతున్న న్యాయవాదులు

శ్రీకాళహస్తి: చట్టాలపై అవగాహన పెంచుకోవాలని న్యాయవాదులు అన్నారు. శ్రీకాళహస్తి సీనియర్ సివిల్‌జడ్జి ఆదేశాల మేరకు మంగళవారం పట్టణంలోని సబ్‌జైల్‌లో ఖైదీలకు చట్టాలపై అవగాహన కల్పించారు. వసతి గదులు, భోజనశాల, పరిసరాలను పరిశీలించారు. ఖైదీలకు అందుతున్న సౌకర్యాలు, భోజనం, ఆరోగ్యంపై ఆరా తీశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సమస్యలు ఏవైనా ఉంటే అర్జీ రూపంలో ఇస్తే తక్షణమే పరిష్కరించేందుకు ప్రయత్నిస్తామన్నారు. కార్యక్రమంలో న్యాయవాదులు రాజేశ్వరరావు, రమేష్‌బాబు, అరుణ్, కోర్టు సిబ్బంది, పారా లీగల్ వలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

శాస్త్రోక్తంగా పురోహిత బ్రహ్మయజ్ఞం

రేణిగుంట: స్థానిక బిస్మిల్లానగర్‌లోని శ్రీ రాజరాజేశ్వరి ఆలయంలో మంగళవారం ఆంధ్రప్రదేశ్ పురోహిత బ్రాహ్మణ సమాఖ్య ఆధ్వర్యంలో పురోహిత, స్మార్త విద్వాన్ మహాసభ, బ్రహ్మయజ్ఞం కార్యక్రమాలు శాస్త్రోక్తంగా జరిగాయి. పురోహిత స్మార్త పరీక్షల అవగాహన సదస్సు, విద్వాన్ మహాసభ పరీక్షలు, అన్నమయ్య కీర్తనలు, సుందరకాండ పారాయణం, చతుర్వేద స్వస్తి కార్యక్రమాలు నిర్వహించారు. సాయంత్రం బ్రహ్మయజ్ఞం మహాసభ పూజా కార్యక్రమాలు వేడుకగా జరిగాయి. ఈ వేడుకలకు సినీనటులు సుమన్, సప్తగిరి హాజరయ్యారు. రాజరాజేశ్వరి ఆలయ జ్ఞానపీఠం పీఠాధిపతి మూర్తిస్వామిని ఆహ్వానించి శాలువతో సత్కరించి దీవెనలు అందించారు. సంఘం రాష్ట్ర అధ్యక్షుడు విద్యాధర శాస్త్రి ఆధ్వర్యంలో వందలాది మంది పురోహితులు పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. బుధవారం ఈ కార్యక్రమాలు ముగియనున్నాయి.

పేదల జీవితాల్లో వెలుగులు

- జగనన్న పాలనలోనే అన్ని వర్గాలకు మేలు
- అర్హులందరికీ సంక్షేమ పథకాలు
- సురక్షలో ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి


సర్టిఫికెట్లు అందుకున్న లబ్ధిదారులతో ఎమ్మెల్యే భూమన, మేయర్ శిరీష, కమిషనర్ హరిత

తిరుపతి మంగళం: సంక్షేమ పథకాలతో పేదల జీవితాల్లో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వెలుగులు నింపుతున్నారని ఎమ్మెల్యే భూమన కరుణాకర రెడ్డి అన్నారు. తిరుపతి నగరంలోని ఒకటో డివిజన్ తిరుమల రెడ్డి నగర్, 10, 11, 24, 39 డివిజన్లక సంబంధించి తుడా మైదానం, క్యాంపస్ స్కూల్, చెన్నారెడ్డి కాలనీలల్లో జగనన్న సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎమ్మెల్యే భూమన, మేయర్ డాక్టర్ శిరీష, కమిషనర్ హరిత, అర్బన్ తహసీల్దార్ వెంకటరమణ లబ్ధిదారులకు సర్టిఫికెట్లను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రతి పేదవాడి జీవితంలో వెలుగులు నింపాలన్న ఉద్దేశంతో అనేక సంక్షేమ పథకాలను అందిస్తున్న గొప్ప నాయకుడు జగనన్న అన్నారు. నాలుగేళ్ల పాలనలో సంక్షేమ పథకాల ద్వారా రూ. 3.30 లక్షల కోట్లు పేదలకు అందించారని తెలిపారు. పార్టీలు, కులాలు, మతాలకు అతీతంగా అర్హులందరికీ సంక్షేమ ఫలాలు అందుతున్నాయని చెప్పారు. కొందరు అర్హత ఉండి సర్టిఫికెట్లు లేకపోవడంతో పథకాలకు దూరంగా అవుతున్నారని గ్రహించి జగనన్న సురక్ష కార్యక్రమానికి శ్రీకారం చుట్టారన్నారు. జగనన్నకు అండగా నిలిస్తే రాష్ట్రాన్ని అన్ని విధాల అభివృద్ధి చేయడంతో పాటు పేదలకు మరిన్ని సంక్షేమ పథకాలను అందిస్తారని తెలిపారు. అనంతరం మేయర్ శిరీష మాట్లాడుతూ.. పాదయాత్రలో ఇచ్చిన హామీల్లో 98 శాతం పైగా అమలు చేసిన గొప్ప నాయకుడు జగనన్న అన్నారు. ప్రజలకు మేలు చేయాలనే తపన జగనన్నదన్నారు. అలాంటి నాయకుడు సీఎంగా ఉంటేనే మరిన్ని సంక్షేమ పథకాలు పొందగలమనే విషయాన్ని ప్రతి ఒక్కరు గుర్తు పెట్టుకోవాలని కోరారు. కమిషనర్ హరిత మాట్లాడుతూ.. జననమరణ, కుల, కుటుంబ, ఆదాయం ఇలా 11 రకాల సర్టిఫికెట్లను ఉచితంగా అందిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో అదనపు కమిషనర్ సునీత, ఉప కమిషనర్ చంద్రమౌళీశ్వర్ రెడ్డి, కార్పొరేటర్లు ఆదం రాధాకృష్ణారెడ్డి, బోకం అనీల్ కుమార్, దొడ్డారెడ్డి ప్రవల్లికారెడ్డి, హనుమంత నాయక్, బొగ్గుల పునీత, మునిరామిరెడ్డి, ఉదయగిరి రమేష్, బాలిశెట్టి కిశోర్, నాయకులు దొడ్డారెడ్డి సిద్దారెడ్డి, దొడ్డారెడ్డి మునిశేఖర్ రెడ్డి, పాముల రమేష్‌రెడ్డి, కుప్పయ్య, యువరాజ్, జయచంద్రారెడ్డి, కొత్తపల్లి రమేష్ రెడ్డి, బాబూయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ సారథి జగనన్న


సంక్షేమ పథకాల లబ్ధిని వివరిస్తున్న ఎమ్మెల్యే భూమన

తిరుపతి మంగళం: అన్ని వర్గాల సంక్షేమానికి ఎన్నో పథకాలు అమలు చేస్తున్న సంక్షేమ సారథి జగనన్న అని ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి అన్నారు. తిరుపతి 7వ డివిజన్ కొర్లగుంటలో మంగళవారం గడప గడపకు మన ప్రభుత్వ కార్యక్రమం నిర్వహించారు. మేయర్ శిరీష, డిప్యూటీ మేయర్ ముద్రనారాయణతో కలిసి గడప గడపకు వెళ్లి సంక్షేమ లబ్ధిని వివరించారు. వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వైఎస్సార్‌సీపీకి అండగా ఉండాలని కోరారు. గతంలో ఎప్పుడూ ఇన్ని సంక్షేమ పథకాలు పొందలేదని..జగనన్న తమ కష్టాలను గుర్తించి ఆదుకుంటున్నారని.. అలాంటి నాయకుడికి ఎప్పుడు అండగా ఉంటామని స్థానికులు స్పష్టం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కరుణాకరరెడ్డి మాట్లాడుతూ.. సంక్షేమ పథకాల ద్వారా ప్రతి కుటుంబానికి రూ.12 లక్షల వరకు లబ్ధి చేకూరుతోందని తెలిపారు. దేశం మెచ్చేలా జగనన్న పాలన సాగిస్తున్నారని.. రాష్ట్ర ప్రజల మనసులు గెలుచుకున్నారని తెలిపారు. సంక్షేమ పథకాలతో పాటు అభివృద్ధి కార్యక్రమాలతో రాష్ట్రాన్ని అన్ని విధాలుగా ముందుకు నడిపిస్తున్నారని చెప్పారు. ఆయనకు వస్తున్న ఆదరణను చూసి ఓర్వలేని ప్రతిపక్ష నాయకులు బురదజల్లే ప్రయత్నాలు చేస్తున్నాయని.. ప్రజలే వారికి బుద్ధి చెబుతారన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు పుల్లూరు అమరనాథ్‌రెడ్డి, టి.మునిరామిరెడ్డి, రామస్వామి వెంకటేశ్వర్లు, పార్టీ డివిజన్ అధ్యక్షుడు చిమట రమేష్, నాయకులు పాముల రమేష్‌రెడ్డి, దేవదానం, నైనారు శ్రీనివాసులు, కాసీమ్, జగదీష్, తాలూరి ప్రసాద్, రాజేంద్ర, శ్రీదేవి, కంకణాల రమేష్, రవిచంద్రారెడ్డి, గఫూర్ తదితరులు పాల్గొన్నారు.

ది లీగల్ విజిలెంట్ మాస పత్రిక ఆవిష్కరణ


మాసపత్రికను ఆవిష్కరిస్తున్న కమిషనర్

తిరుపతి తుడా: ది లీగల్ విజిలెంట్ మాస పత్రికను తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ డి.హరిత, డిప్యూటీ మేయర్ భూమన అభినయ్ రెడ్డి మంగళవారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు తాళ్లూరి ప్రసాద్, పత్రిక ఎడిటర్ మహేంద్ర పాల్గొన్నారు.

పేదలకు అన్నదానం


అలిపిరి బస్టాండ్ వద్ద అన్నదానం చేస్తున్న గిరిజన సంఘం నేతలు

తిరుపతి కల్చరల్: రాష్ట్ర ఎస్టీ కమిషన్ సభ్యుడు వడిత్యా శంకర్ నాయక్ పుట్టిన రోజును పురస్కరించుకుని గిరిజన సంఘాల నేతలు మంగళవారం అలిపిరి బస్టాండ్ వద్ద అన్నదానం చేశారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేశారు. అందరికీ స్వీట్లు పంచిపెట్టారు. గిరిజన సంఘాల నేతలు కె.శంకర్ నాయక్, మొగావత్ తేజ నాయక్, డి.మంజుకుమార్ నాయక్, ఎం.బాబ్జి నాయక్, ఆర్.వినోద్ రాథోడ్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

సత్వర సేవలకే జగనన్న సురక్ష


లబ్ధిదారులకు ధ్రువపత్రాలు అందిస్తున్న చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి

రామచంద్రాపురం: జగనన్న సురక్ష కార్యక్రమంలో సత్వర సేవలు పొందవచ్చని.. ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని వైఎస్సార్‌సీపీ చంద్రగిరి ఎమ్మెల్యే అభ్యర్థి చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని అనుప్పల్లిలో జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సచివాలయ పరిధిలో రూ. 28,352 విలువ గల 670 సేవలను ఉచితంగా అందించినట్లు తెలిపారు. ఇందులో 78 కుల ధ్రువీకరణ, 84 ఆదాయ పత్రాలు, 147 అడంగల్, ఒక ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్, నూతన రేషన్ కార్డులు, బియ్యం కార్డుల్లో మార్పులు, చేర్పులు, జనన, మరణ ధ్రువీకరణ పత్రాలు, ఆధార్ సేవలు ఉన్నాయని తెలిపారు. ఎలాంటి రుసుం లేకుండా లబ్ధిదారులకు అందించినట్లు వివరించారు. సంక్షేమ పథకాలు, రేషన్‌కార్డు, సర్టిఫికెట్ల సమస్యలు ఉంటే జగనన్న సురక్షలో పరిష్కరించుకోవచ్చన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ బ్రహ్మానందరెడ్డి, జెడ్పీటీసీ సభ్యురాలు ఢిల్లీరాణి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ చంద్రశేఖర్‌రెడ్డి, ఎంపీడీఓ మహ్మద్‌రఫీ, తహసీల్దార్ చిన్న వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ధ్రువపత్రాల పంపిణీ

పాకాల: అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందాలనే ఉద్దేశంతోనే జగనన్న సురక్ష కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు జెడ్పీటీసీ సభ్యురాలు నంగా పద్మజా రెడ్డి అన్నారు. మంగళవారం పాకాల మండలం గాదంకి పంచాయతీలో జగనన్న సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ.. కులం, మతం, ప్రాంతం, పార్టీ అనే తారతమ్యాలు లేకుండా ఉచితంగా ధ్రువపత్రాల పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ ప్రభాకర్, తహసీల్దార్ భాగ్యలక్ష్మి, సర్పంచ్ సీతమ్మ, ఏపీఎం కోమలాదేవి పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికే సురక్ష

భాకరాపేట: ప్రజలకు అవసరమైన సర్టిఫికెట్లు, సంక్షేమ పథకాలతో పాటు సమస్యలను తెలుసుకుని వాటిని పరిష్కరించడానికి ప్రజలకు రక్షగా.. జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ప్రభుత్వం తీసుకొచ్చిందని చిన్నగొట్టిగల్లు ఎంపీపీ యుగంధర్‌రెడ్డి అన్నారు. చిన్నగొట్టిగల్లులో జరిగిన జగనన్న సురక్ష కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. ప్రతి ఇంటికి వెళ్లి సమస్యలను పరిష్కరించడానికే ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని తీసుకొచ్చిందన్నారు. ఈ కార్యక్రమం ద్వారా సేవలను ఉచితంగా అందిస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా 730 మందికి వివిధ రకాల ధ్రువపత్రాలను అందజేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ దేవేంద్ర బాబు, తహసీల్దార్ లోకేశ్వరి, సూపరింటెండెంట్ మదనమోహనరాజు, సర్పంచ్ మనోహర్, ఈఓపీఆర్డీ సతీష్, డిప్యూటీ తహసీల్దార్ అన్వర్, వివిధ శాఖల అధికారులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.


పాకాలలో..


చిన్నగొట్టిగల్లులో సర్టిఫికెట్లు అందజేస్తున్న ఎంపీపీ

సేవాభావంతో ముందుకు సాగుదాం

- వైఎస్సార్ ఈయూ రాష్ట్ర అధ్యక్షుడు చల్లా చంద్రయ్య
- జిల్లా నూతన కమిటీ ఎంపిక


నూతన కమిటీని ఎంపిక చేస్తున్న రాష్ట్ర కమిటీ చైర్మన్, సభ్యులు

తిరుపతి అర్బన్: ఆర్టీసీ ఉద్యోగులు సేవాభావంతో ముందుకు సాగాలని వైఎస్సార్ ఎంప్లాయీస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు చల్లా చంద్రయ్య అన్నారు. తిరుపతి యూత్ హాస్టల్‌లో మంగళవారం తిరుపతి జిల్లా కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా చంద్రయ్య మాట్లాడుతూ.. ఆర్టీసీ ఉద్యోగుల సమస్యల పరిష్కారంతో పాటు సేవా కార్యక్రమాలు చేపట్టనున్నట్లు తెలిపారు. ఆ మేరకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు వెల్లడించారు. కాగా తిరుపతి జిల్లా కౌన్సిల్ సమావేశానికి 400 మందికిపైగా ఆర్టీసీ ఉద్యోగులు హాజరయ్యారు. రాష్ట్ర కమిటీ సభ్యులు మురళీధర్, లతా రెడ్డి, మంగమ్మ, అర్జున్, ఎంటీఆర్ రెడ్డి, జోనల్ కమిటీ సభ్యులు పరంధామ, శ్యామ్ కుమార్ నేతృత్వంలో జిల్లా కమిటీని ఎంపిక చేశారు.

నూతన కమిటీ ఎంపిక

ఆర్టీసీ వైఎస్సార్ ఎంప్లాయీస్ అసోషియేషన్ జిల్లా చైర్మన్‌గా ఎస్.అల్లయ్య, అధ్యక్షుడిగా జీవీ ముని, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా కోట బాబు, కార్యదర్శిగా జి.నరసింహులు, అదనపు కార్యదర్శులుగా పి.రాంబాబు, ప్రకాష్, డీజే చంద్ర, శ్రీరాములు, జిల్లా ఉపాధ్యక్షులుగా బాలగణపతి, రవీంద్ర, మురళి, సీఎం దామోదరం, దొరబాబులను ఏకగ్రీవంగా ఎంపిక చేశారు.


హాజరైన వైఎస్సార్ ఎంప్లాయీస్ అసోషియేషన్ నేతలు

శ్మశానంలో మౌలిక వసతుల కల్పనకు శ్రీకారం


శ్మశాన స్థలాన్ని శుభ్రం చేయిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

చంద్రగిరి(తిరుపతి రూరల్): ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి చొరవతో పనపాకం శ్మశాన వాటికలో మౌలిక వసతుల కల్పనకు శ్రీకారం చుట్టారు. వైఎస్సార్‌సీపీ పంచాయతీ అధ్యక్షుడు చెంగల్రాయులు ఆధ్వర్యంలో మంగళవారం శ్మశాన స్థలంలో ముండ్ల కంపలను తొలగించారు. పరిసరాలను శుభ్రం చేశారు. ఇటీవల ఎమ్మెల్యే చొరవతో శ్మశానానికి స్థలం కేటాయించారు. ముండ్ల కంపలు తొలగించి, దారి సౌకర్యం కల్పించారు. శ్మశాన వాటికలో కర్మక్రియల భవనాన్ని నిర్మిస్తామని, తాగునీటి బోరు ఏర్పాటు చేస్తామని వైఎస్సార్‌సీపీ నాయకులు తెలిపారు.

● ఆనందమానందమాయే





గడప గడపకు కార్యక్రమంలో భాగంగా ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి మంగళవారం తిరుపతి 7వ డివిజన్ కొర్లగుంటలోని విశ్వభారతి స్కూల్ వీధిలో పర్యటించారు. సంక్షేమ పథకాలను వివరిస్తూ ముందుకు సాగుతుండగా అక్కడున్న వృద్ధురాలు లక్ష్మమ్మతో మాట్లాడారు. వచ్చే ఎన్నికల్లో ఎవరికి ఓటు వేస్తావమ్మా అని అడిగారు. ఎవరికో ఎందుకు వేస్తాను మాకు సంక్షేమ పథకాలు అందించి అన్ని రకాలుగా ఆదుకుంటున్న మా జగన్‌కే ఓటు వేస్తానని ఠంగు పదంగా చెప్పడంతో అక్కడున్న వారంతా నవ్వులు చిందించారు. ఆమెకు ఎమ్మెల్యే ధన్యవాదాలు చెప్పి ముందుకు సాగారు. - సాక్షి ఫొటోగ్రాఫర్, తిరుపతి

అమ్మవారిని దర్శించుకున్న నటి రమ్యకృష్ణ



తిరుచానూరు(చంద్రగిరి): తిరుచానూరు శ్రీపద్మావతి అమ్మవారిని ప్రముఖ సినీ నటి రమ్యకృష్ణ మంగళవారం దర్శించుకున్నారు. ఆలయం వద్దకు చేరుకున్న ఆమెకు ఆలయ అధికారులు స్వాగతం పలికి, ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేశారు. ముందుగా ఆలయ ధ్వజస్తంభం వద్ద మొక్కుకుని అమ్మవారిని మూలమూర్తిని దర్శించుకున్నారు. దర్శనానంతరం ఆశీర్వాద మండపంలో వేద పండితులు ఆశీర్వచనం పలుకగా అధికారులు తీర్థ ప్రసాదాలను అందజేశారు.

మధుర మీనాక్షిగా నేత్రదేవత


మీనాక్షి అలంకరణలో దేశమ్మ దేవత

నగరి : ఆడి పూజల్లో భాగంగా నేత్రదేవత దేశమ్మను మధురమీనాక్షిగా అలంకరించారు. ఆడి మంగళవారం అమ్మవారికి ప్రత్యేకం కావడంతో ఆలయం భక్తులతో కిక్కిరిసింది. ఆలయానికి విచ్చేసిన భక్తులు పొంగళ్లు పెట్టి అమ్మవారికి మొక్కులు తీర్చుకున్నారు. ఆలయం ముందున్న అమ్మవారి పాదుకల వద్ద పొంగళ్లు ఉంచి పూజలు చేశారు. ఆలయ నిర్వాహకులు భక్తులను నియంత్రించడానికి ప్రత్యేక క్యూలైన్లు ఏర్పాట్లు చేశారు. భక్తులు అమ్మవారి దర్శనం చేసుకుని తీర్థం కళ్లలో చల్లుకున్నారు. ఆలయ కమిటీ చైర్మన్ వేణుబాబు, ఈఓ మునికృష్ణయ్య, ధర్మకర్తలు ఏర్పాట్లను పర్యవేక్షించారు. ఆలయ కమిటీ మాజీ చైర్మన్, కౌన్సిలర్ దయానిధి ఆలయానికి విచ్చేసిన భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తలు పాల్గొన్నారు.

మణిపూర్ హింసాకాండకు మోదీ విధానాలే కారణం

- సీపీఐ రాష్ట్ర నేత హరినాథరెడ్డి


పద్మావతి పార్కు వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న సీపీఐ నేతలు

తిరుపతి కల్చరల్: మణిపూర్ హింసాకాండకు మోదీ విధానాలే కారణమని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు పి.హరినాథరెడ్డి అన్నారు. హింసాకాండను అరికట్టాలని డిమాండ్ చేస్తూ సీపీఐ ఆధ్వర్యంలో మంగళవారం బైరాగిపట్టెడలోని శ్రీపద్మావతి పార్క్ వద్ద నిరసన వ్యక్తం చేశారు. ఆయన మాట్లాడుతూ.. బీజేపీ పాలిత రాష్ట్రం మణిపూర్‌లో కొద్ది నెలలుగా అల్లర్లు చెలరేగుతున్నా ప్రధాని మోదీ, హోంమంత్రి అమిత్‌షా అదుపు చేయలేని పరిస్థితిలో ఉన్నారన్నారు. వారి నిర్లక్ష్యం వల్లే కుకీ జాతికి చెందిన ముగ్గురు మహిళలను నగ్నంగా ఊరేగించి అత్యాచారం చేశారని దుయ్యబట్టారు. 2024లో బీజేపీ ప్రభుత్వం పతనం తప్పదని.. అందుకు దేశ ప్రజలంతా సిద్ధంగా ఉన్నారని స్పష్టం చేశారు. కిరాతకులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు రామానాయుడు, పి.మురళి, విశ్వనాథ్, ఏఐటీయూసీ నేతలు రాధాక్రిష్ణ, నాగ సుబ్బారెడ్డి, మహిళా సమాఖ్య నేతలు నదియా, మంజుల, రత్నమ్మ, ఎన్‌డీ.రవి, ఏఐవైఎఫ్ నేత రామకృష్ణ, ఎస్.శివ, శ్రీరాములు, రాజా పాల్గొన్నారు.

వ్యక్తిత్వ వికాసంపై అవగాహన


మాట్లాడుతున్న డాక్టర్ ఉమాదేవి

రేణిగుంట: వ్యక్తిత్వ వికాసం ద్వారా సమాజంలో ప్రత్యేక గుర్తింపు రాణించి పురోభివృద్ధి సాధిస్తారని శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం మహిళా అధ్యయన కేంద్రం అసోసియేట్ ప్రొఫెసర్ ఉమాదేవి అన్నారు. రేణిగుంట వెలుగు కార్యాలయంలో మంగళవారం డ్వాక్రా సంఘాల మహిళలకు వ్యక్తిత్వ వికాసంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ వినూత్న ఆలోచనలతో వ్యాపార రంగంలో కూడా మహిళలు రాణించవచ్చన్నారు. అందుబాటులో ఉన్న వనరులను ఉత్పాదకతగా మార్చి ఆదాయం పొందవచ్చన్నారు. సమాజంలో విలువలతో కూడిన జీవన శైలిని అలవర్చుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఏపీఎం నరసింహులు, సీసీలు , సిబ్బంది పాల్గొన్నారు.

ఆధునికతకు అనుగుణంగా నైపుణ్యాలు


మాట్లాడుతున్న అసిస్టెంట్ డైరెక్టర్ కుమార్

పుత్తూరు రూరల్: కాలానుగుణంగా వస్తున్న మార్పులకు అనుగుణంగా చేనేత కార్మికులు ఆధునికతను అందిపుచ్చుకుని నైపుణ్యం సాధించాలని సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమల మంత్రిత్వ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ ఎస్ఎల్ఎస్ కుమార్ అన్నారు. మంగళవారం పుత్తూరు రూరల్ మండలం గొల్లపల్లెలో చేనేత కళాకారుల ధ్రువీకరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ, నారాయణవనంలో చేనేత సౌకర్య సేవా సముదాయ భవన నిర్మాణం చేపడుతున్నట్లు తెలిపారు. ఈ సముదాయంలో చుట్టుపక్కల గ్రామాల్లో ఉన్న చేనేత కార్మికులను గుర్తించి వారికి ప్రత్యేక శిక్షణ ఇస్తామన్నారు. అనంతరం వస్తువుల తయారీ, అమ్మకాలను సైతం సెంటర్ ద్వారా జరుగుతాయని వివరించారు. తర్వాత గ్రామంలో సర్వే నిర్వహించి చేనేత కార్మికుల పేర్లను నమోదు చేశారు. కార్యక్రమంలో అడిషనల్ డైరెక్టర్ ఆర్.విజయకుమార్, డీఆర్‌డీఏ పీడీ ఏడీ జ్యోతి, అడిషనల్ పీడీ పి.ప్రభావతి, వైస్ ఎంపీపీ కె.మునస్వామిరెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు దేవేందర్‌రెడ్డి పాల్గొన్నారు.